

సక్సెస్... దీని రెసిపీ ఒక్కొక్కరికీ ఒక్కోలా ఉంటుంది. రుచి అంతే ఎవరిది వారికే! వ్యక్తులు ప్రయాణించిన మార్గాలు, ఎదుర్కొన్న ఒడుదొడుకులు, ఎక్కిన మెట్లు పాకాన్ని పక్వానికి తెస్తాయి. నలుగురితోనూ 'వారెవ్వా!' అనిపిస్తాయి. విజయానికి కావలసిన ఈ దినుసులన్నీ దండిగా ఉన్న నిండు జీవితం రాధికా గుప్తది. పుట్టుకతోనే మెడ విరిగిన చిన్నారి ఆమె. కష్టపడి చదివినా ఉద్యోగాల్లో ఎన్నో తిరస్కారాలు. ఆత్మహత్య ఆలోచనల నుంచి అతి పిన్న వయసు సీఈఓల్లో ఒకరిగా అయ్యే దాకా సాహసోపేతంగా సాగిన జీవితం ఆమెది. ప్రస్తుతం ఎడెల్‌వీస్ మ్యూచువల్ ఫండ్ సంస్థ సీఈఓగా, షార్క్‌ట్యాంక్ కార్యక్రమానికి జడ్జిగా జనానికి సుపరిచితురాలైన రాధిక ప్రయాణం ఆద్యంతం స్ఫూర్తిమంతం!

# ఆమె అడుగులే.. ఆర్థిక పాఠాలు



సోషల్ మీడియా యుగంలో జనానికి చేరువైన వ్యాపారవేత్తల్లో ఎడెల్‌వీస్ సీఈఓ రాధికా గుప్త ఒకరు. మార్కెట్ ట్రెండ్స్‌ను గమనిస్తూ పెట్టుబడి పాఠాలు, ఆర్థిక సలహాలు, సూచనలు అందిస్తుంటారామె. అమెరికా లాంటి దేశాల్లో అధ్యక్ష మార్పు సహా రకరకాల కారణాల వల్ల తీవ్ర ఒత్తిడిలో కొనసాగుతున్న స్టాక్ మార్కెట్ గురించీ, అందులో సిప్‌లు చేసేవారికి సంబంధించీ ఇటీవల ఆమె చెప్పిన మాటలకు మంచి స్పందన వచ్చింది. ఇలా సందర్భానుసారంగా జనంలో ధైర్యాన్ని నింపడమే కాదు, తనకు తానూ జీవితంలో ఎంతో ధైర్యంగా ముందుకెళ్లారామె. అసలు ఉద్యోగానికే పనికిరాదన్న రంగంలోనే రాణించి నేడు 45 వేల కోట్ల రూపాయల విలువైన సంస్థకు మేనేజింగ్ డైరెక్టర్ కమ్ సీఈఓగా పనిచేస్తున్నారు. తిరస్కారాలు ఎదుర్కొన్న చోటే పురస్కారాలు అందుకున్నారు. అలాగని ఆమె ఏ వ్యాపారవేత్తల కుటుంబం నుంచో వచ్చారనుకుంటే మనం పొరబడ్డట్టే. మామూలు కుటుంబం నుంచి వచ్చిన ఆమె, స్వయంకృషితో ఏ స్థాయికైనా చేరొచ్చు అన్నదానికి ఉదాహరణగా నిలిచారు.



### మధ్యతరగతి నుంచే..

రాధికా గుప్త తండ్రి భారత విదేశాంగ శాఖలో ఉన్నత స్థాయి ఉద్యోగి. వృత్తి రీత్యా ఆయన రకరకాల దేశాలు తిరుగుతూ ఉండేవారు. రాధిక పుట్టే సమయానికి ఆయన పాకిస్థాన్‌లో ఉన్నారు. ప్రసవ సమయంలో సమస్యలు తలెత్తడంతో రాధిక మెడ విరిగిపోయి పుట్టారు. దీని కారణంగా ఆమె తల వంకరగా కనిపిస్తూ ఉంటుంది. కన్ను కూడా కాస్త మెల్లగానే ఉంటుంది. ఈ రూపురేఖల పరంగా చిన్ననాటి నుంచీ ఎన్నో వెక్కిరింతలు ఎదుర్కొన్నారామె. అయితే అవేమీ ఆమెను చదవకుండా ఆపలేకపోయాయి. ఎప్పుడూ తరగతిలో ఆమే ముందు. ఇక, ఆమె తండ్రికి పాకిస్థాన్ నుంచి న్యూయార్క్‌కి బదిలీ అవ్వడంతో అక్కడి పాఠశాలలో చేరారు. తర్వాత నైజీరియాలోని ఓ ఇంటర్నేషనల్ స్కూల్‌లో చదువుకున్నారు. ఈ బడిలో అపర కుబేరులు, వ్యాపారవేత్తల పిల్లలు చదివేవారు. వారికి గుర్రం సవారీ, ఈతలాంటి హాబీలుండేవి. దీంతో తనకంటూ ఓ హాబీ ఉండాలని రాధిక భావించేవారు. అయితే ఇలాంటి అభిరుచులు ఖరీదైన వ్యవహారం. మధ్యతరగతి కుటుంబాల్లో చదువుతో పాటు వీటికీ డబ్బులు కట్టడం కాస్త కష్టమే! కానీ తనకూ ఏదో ఒక హాబీ కావాలని ఇంట్లో వాళ్లను తరచూ అడగడంతో 'ఎంచక్కా పేకాట ఆడుకుందాం..' అన్నారు అమ్మానాన్న. దీంతో వాళ్లతో కూర్చుని ఆడుతూ అందులో నైపుణ్యం సాధించారు. అది ఓ సందర్భంలో ఆమె ఎదుగుదలకు సాయపడింది. ప్లస్ టూ తర్వాత అమెరికాలోని పెన్సిల్వేనియా యూనివర్సిటీ నుంచి కంప్యూటర్ సైన్స్ విభాగంలోనూ, ఆర్థిక శాస్త్రంలోనూ డిగ్రీ పట్టాలు అందుకున్నారు.

### ఏడుసార్లు తిరస్కరణ

గొప్ప విద్యాలయాల నుంచి పెద్ద చదువులు పూర్తిచేసినా ఉద్యోగాల విషయంలో కంపెనీలు రాధికకు ప్రాధాన్యం ఇవ్వలేదు. చదువు పూర్తవుతూనే క్యాంపస్‌కి వచ్చిన ఒకటీ రెండూ కాదు 7 కంపెనీలు ఆమెను తిరస్కరించాయి. అసలే చిన్నప్పటినుంచి వెక్కిరింతలు ఎదుర్కొని సున్నితంగా మారిన ఆమె మనసు ఈ పరిణామంతో కుంగుబాటుకు గురైంది. 19వ అంతస్తులో ఉన్న ఆమె ఈ కిటికీ నుంచి దూకేస్తా అంటూ అరవడంతో స్నేహితురాలు కాపాడింది. తర్వాత మానసిక చికిత్సకూ వెళ్లారు రాధిక. ఆ తర్వాత హాజరైన ఓ ఇంటర్వ్యూ ఆమె జీవితాన్ని మలుపు తిప్పింది. ప్రముఖ ఆర్థిక సేవల సంస్థ మెకెన్జీలో ఇంటర్వ్యూ అది. చదువు కాకుండా మీకేం వచ్చు అన్న ప్రశ్న ఎదురైందక్కడ. నిజానికి ఆమెకు డిగ్రీలో చేరేప్పుడూ

ఇదే సమస్య ఎదురైంది. దీంతో రాధిక తనకొచ్చిన పేకాట గురించే ఉన్నది ఉన్నట్టు చెప్పారు. ఆ ఉన్నతాధికారి ఈ ఆటలో అమెరికా టోర్నమెంట్ స్థాయి క్రీడాకారిణి కావడంతో ఇంటర్వ్యూ మొత్తం దాని గురించే సాగింది. రాధిక ఆ ఉద్యోగానికి ఎంపికయ్యారు. తర్వాత వాల్‌స్ట్రీట్‌లోనూ కొంత కాలం పనిచేశారు.

### స్ఫూర్తి నింపాలని..

మాంద్యం సమయంలో రాధిక భారత్‌కి వచ్చి, తన ఇద్దరు స్నేహితులతో కలిసి 2009లో 'ఫోర్‌ఫ్రంట్ క్యాపిటల్ మేనేజ్‌మెంట్' అనే సంస్థను ప్రారంభించారు. ఆ స్నేహితుల్లో ఒకరైన నళిన్ మనోజ్ ఆ తర్వాతి కాలంలో ఆమె జీవిత భాగస్వామి అయ్యారు. వీళ్లు స్థాపించిన సంస్థకు మంచి పేరు రావడంతో ఎడెల్‌వీస్ సంస్థ దీన్ని కొనుగోలు చేసింది. రాధికకు కీలక పదవిని కట్టబెట్టింది. కొద్ది రోజుల్లోనే మంచి పనితీరుతో ఆమె ఆ సంస్థకు సీఈవో స్థాయికి చేరుకున్నారు. అప్పటికి ఆమె వయసు 33 ఏండ్లు మాత్రమే. భారత్‌లో చిన్న వయసులో సీఈవోలైన కొద్దిమందిలో ఒకరామె. తాను ఎదుర్కొన్న ఎత్తుపల్లాల ఆధారంగా ఔత్సాహిక వ్యాపారవేత్తలకు సలహాలు ఇవ్వడం అంటే ఆమెకు ఇష్టం. దాంతోనే స్టార్టప్‌లకు ఫండింగ్ చేసే ప్రముఖ టీవీ షో షార్క్‌ట్యాంక్‌కు న్యాయనిర్ణేతగానూ చేరారు. ఉద్యోగం- వ్యక్తిగత జీవితం, పొదుపు-మదుపుల గురించి సోషల్ మీడియా వేదికగా అభిప్రాయాలు పంచుకుంటూ వార్తల్లో నిలుస్తుంటారు. అంతేకాదు, వైకల్యం కారణంగా న్యూనతకు గురయ్యే వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపేందుకు 'లిమిట్‌లెస్' పేరిట తన జీవిత విశేషాలతో ఓ పుస్తకాన్ని తీసుకొచ్చారు. నిజమైన జీవితాలకు మించిన స్ఫూర్తి పాఠాలు ఇంకేం ఉంటాయి చెప్పండి!

## ఎంతెత్తు భయమే!

ఎత్తయిన చోట ఉన్నప్పుడు పడిపోతామేమోననే భయంతో కొంత మంది బిగుసుకుపోతారు. జాగ్రత్తపడటం మంచిదే. కానీ, పడిపోకుండా రక్షణ ఉన్నా భయపడతారు. పర్వతాలు, వంతెనలు, ఎత్తయిన కట్టడాలపైకి వెళ్లినప్పుడు అందరూ ఉల్లాసంగా గడిపేస్తుంటే వీళ్లు తమతోపాటు పక్కవాళ్లను కూడా భయపెడుతుంటారు. ఎత్తయిన ప్రదేశంలో నిలబడి సుదూరాన్ని చూస్తుంటే సంతోషానికి బదులు భయం కలుగుతుంటే ఆక్రోఫోబియా ఉందని అర్థం చేసకోవాలి. దీన్ని తేలిగ్గా అధిగమించవచ్చు. ఆక్రోఫోబియా మీ మనసు, శరీరంపై ఎలాంటి ప్రభావం చూపుతుందో మొదటగా అర్థం చేసుకోండి. అప్పుడు దాన్ని పోగొట్టుకోవడానికి మీ అంతట మీరే ప్రయత్నిస్తారు. ఆక్రోఫోబియా నుంచి బయటపడటానికి కొద్దిపాటి ఎత్తయిన ప్రదేశాలకు తరచుగా పోతూ ఉండాలి. ఎత్తయిన ప్రదేశాల్లో ఉన్నప్పుడు సుదీర్ఘంగా గాలి పీల్చుకోవడం, మనసును అదుపులో పెట్టుకోవడానికి కొంచెంసేపు ధ్యానం చేయండి. అప్పుడు ఆందోళన తగ్గుతుంది. మిమ్మల్ని ఉత్సాహపరిచే వాళ్లకు దగ్గరగా ఉండండి.



## వంటింట్లో రహస్య శత్రువులు

వంటగది చిన్నదే అయినా ఇంటికి గుండెకాయ లాంటిది. అయితే, ఇంటిల్లిపాదికీ భోజనం సమకూర్చే చోట ప్లాస్టిక్ చాప్ బోర్డులు, నాన్‌స్టిక్ పాత్రల రూపంలో మనకు కనిపించని ప్రమాదాలు దాగున్నాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అవేంటో తెలుసుకుందాం.

### ప్లాస్టిక్ చాప్ బోర్డులు

కూరగాయలను కత్తిరించడానికి వాడే ప్లాస్టిక్ బోర్డులు తేలిగ్గా, కడుక్కోవడానికి సులువుగా, చవకగా దొరుకుతాయి. అయితే, కూరగాయలు, ఆకుకూరలు తరుగుతున్నప్పుడు బోర్డుపై కత్తి గాట్లు పడతాయి. దీంతో చిన్న చిన్న ప్లాస్టిక్ కణాలు విడుదలవుతాయి. ఇవి ఆహారాన్ని కలుషితం చేస్తాయి. మన శరీరాల్లో చేరిపోతాయి. దీర్ఘ



కాలిక ఆరోగ్య సమస్యలకు అంటుకడతాయి. కాబట్టి, ప్లాస్టిక్ చాప్ బోర్డుల స్థానంలో చెక్కవిగాని, గ్లాసువిగానీ వాడితే మంచిదట. చెక్కవి మంచివే అయినప్పటికీ వీటిని శుభ్రంగా ఉంచుకోవాలి. లేకపోతే బ్యాక్టీరియా లాంటి సూక్ష్మక్రిములు చేరిపోయి హానికరంగా మారతాయి. ఇక గ్లాసువి మంచివే అయినప్పటికీ కత్తి పదును తొందరగా తగ్గిస్తాయి. అలా రోజువారీ ఉపయోగానికి అంతగా పనికిరావు.

### గీతలు పడ్డ నాన్‌స్టిక్ ప్యాన్లు

ఇప్పుడు అన్ని ఇళ్లలో కనీసం ఒక్కటైనా నాన్‌స్టిక్ పాత్ర తప్పకుండా ఉండి ఉంటుంది. వీటిని ఉపయోగించడం సులువుగా ఉన్నప్పటికీ గీతలు పడటం, పొర అరిగిపోతే మాత్రం ప్రమాదకరంగా పరిణమిస్తాయి. గీతలు పడిన నాన్‌స్టిక్ ప్యాన్లు పర్ ఫ్లోరో ఆల్కయిల్, పాలి ఫ్లోరో ఆల్కయిల్ పదార్థాలను (పీఎఫ్ఏలు) విడుదల చేస్తాయి. పీఎఫ్ఏలకు మనుషుల పునరుత్పాదక ఆరోగ్య సమస్యలకు సంబంధం ఉంటుంది. అందుకే నాన్‌స్టిక్‌కు బదులుగా స్టెయిన్‌లెస్ స్టీలు లేదా పోత ఇనుము వంటపాత్రలు వాడాలని సలహా ఇస్తున్నారు.

## వాడకుంటే.. అంతే!

క్రెడిట్ కార్డు.. ఒకప్పుడు వ్యాపారులు, ఉన్నత ఉద్యోగుల దగ్గరే కనిపించేది. ఇప్పుడు ఆదాయంతో సంబంధం లేకుండా అందరి చేతుల్లోనూ దర్శనమిస్తున్నది. చేతిలో డబ్బులు లేకపోయినా.. అత్యవసర సమయాల్లో ఆదుకుంటుంది. కనీసం.. 40 రోజుల దాకా ఎలాంటి వడ్డీ లేకుండా బిల్లు చెల్లించే అవకాశం కల్పిస్తుంది. ఇలాంటి ఎన్నో కారణాల వల్ల.. క్రెడిట్ కార్డుల వినియోగం పెరుగుతున్నది. అంతేకాదు.. ఒక్కొక్కరి దగ్గర రెండుమూడు కార్డులూ ఉంటున్నాయి. ఈ క్రమంలో అందరూ అన్ని కార్డులనూ వాడలేరు. ఎక్కువ రివార్డ్ స్‌పాయింట్స్ ఇచ్చేవాటిని వాడుతూ.. మిగతావి పక్కన పడేస్తుంటారు. క్రెడిట్ కార్డులను వాడకుంటే.. బిల్లులు పెండింగ్ ఉండవు కాబట్టి, ఎలాంటి ఇబ్బందీ ఉండదని అనుకుంటారు. అయితే.. నిరుపయోగంగా ఉండే క్రెడిట్ కార్డ్‌తో కొన్ని సైడ్ ఎఫెక్ట్స్ ఉంటాయని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు.

సాధారణంగా క్రెడిట్ కార్డును ఆరు నెలల నుంచి ఒక సంవత్సరం వరకు ఉపయోగించకపోతే.. అది ఇన్‌యాక్టివ్‌గా మారుతుంది. అయితే, అంతకుముందే క్రెడిట్ కార్డ్ జారీచేసిన సంస్థ సంప్రదిస్తుంది. కార్డును తిరిగి యాక్టివేట్ చేసుకోవడానికి అవకాశం కల్పిస్తుంది. ఏ కారణం చేతనైనా దాన్ని ఉపయోగించుకోకుంటే.. క్రెడిట్ అకౌంట్‌ను ఇన్‌యాక్టివ్ విభాగం కిందికి మారుస్తుంది. ఈ పరిణామం.. వినియోగదారుల క్రెడిట్ స్కోర్‌పై ప్రతికూల ప్రభావం చూపుతుంది. క్రెడిట్ ఖాతాను మూసివేయడం వల్ల క్రెడిట్ స్కోర్ తగ్గుతుంది. అంతేకాకుండా.. క్రెడిట్ వినియోగ నిష్పత్తి కూడా పెరుగుతుంది. క్రెడిట్ స్కోర్ బాగుండాలంటే.. క్రెడిట్ వినియోగం తక్కువగా ఉండాలి. అంటే, క్రెడిట్ కార్డు పరిమితిలో 30 శాతానికి మించకుండా వినియోగించుకోవాలి. అదే.. ఏదైనా కార్డ్ క్లోజ్ అయితే, మిగిలిన కార్డ్‌పైనే ఎక్కువగా ఆధారపడాల్సి వస్తుంది. దాంతో వాటి ద్వారానే ఎక్కువ ఖర్చు చేయాల్సి రావడం వల్ల క్రెడిట్ వినియోగ నిష్పత్తి పెరుగుతుంది. ఫలితంగా, క్రెడిట్ స్కోర్ తగ్గుతుంది. దీంతోపాటు క్రెడిట్ కార్డుతో వచ్చే రివార్డులు, క్యాష్‌బ్యాక్ ఆఫర్లు వంటి ప్రయోజనాలను కోల్పోవాల్సి వస్తుంది.




### ఇలా చేయండి..

- క్రెడిట్ కార్డ్ యాక్టివ్‌గా ఉండాలంటే.. రెగ్యులర్‌గా వాడుతూ ఉండాలి. కనీసం మూడు నెలలకు ఒకసారైనా.. ఏదో ఒక చిన్న లావాదేవీ అయినా చేయాలి.
- క్రెడిట్ కార్డ్ స్టేట్‌మెంట్లను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూ ఉండాలి. ఏదైనా అనుమానిత లావాదేవీలు, చార్జీలు ఉన్నాయేమో గమనించాలి.
- మీకు క్రెడిట్ కార్డ్ అవసరం లేకపోతే.. వెంటనే క్లోజ్ చేసుకోవాలి. ఇందుకోసం కార్డును జారీచేసిన సంస్థను సంప్రదించాలి. పెండింగ్ బిల్లులను క్లియర్ చేసుకోవాలి.
- ఒకవేళ కార్డ్ ఇన్‌యాక్టివ్‌గా మారితే.. తిరిగి యాక్టివేట్ చేసుకోవడానికి బ్యాంక్/ఆర్థిక సంస్థను సంప్రదించాలి.



## హంపికి వెళ్దాం!

హంపి ఉత్సవకు వేళైంది. విజయనగర సామ్రాజ్య వైభవాన్ని కళ్లకు కట్టే 'హంపి' నగరం వేదికగా.. ఈ మెగా ఈవెంట్ జరగనున్నది. ఫిబ్రవరి 28న ప్రారంభమై, మార్చి 2 వరకు మూడురోజులపాటు కొనసాగనున్నది. ఈ సందర్భంగా నిర్వహించే 'హంపి బై స్కై'తోపాటు అనేక వినోద, సాంస్కృతిక కార్యక్రమాలు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటాయి. వింటేజ్ కార్ ర్యాలీతోపాటు స్పోర్ట్స్ బైక్ స్టంట్స్ లాంటి సాహస ప్రదర్శనలూ అలరిస్తాయి. హంపిని సందర్శించేందుకు ఇదే మంచి సమయం. అయితే, 'హంపి ఉత్సవ' సందర్భంగా పర్యాటకుల తాకిడి పెరుగుతుంది. కాబట్టి, ఇక్కడికి వెళ్లాలని అనుకునేవారు స్థానిక హోటళ్లలో ముందస్తు బుకింగ్స్ చేసుకోవాలి. హంపిలో వాతావరణం వేడిగా ఉంటుంది. ఎండలు మొదలైన నేపథ్యంలో.. అందుకు తగ్గ ఏర్పాట్లు చేసుకోవాలి. వేడి వాతావరణానికి తగ్గట్టుగా తేలికపాటి దుస్తులే తీసుకెళ్లాలి. ఎక్కువ దూరం నడవడానికి, సూర్యుడి నుంచి రక్షణకు అనువుగా, సౌకర్యవంతంగా ఉండే బూట్లు ధరించడం మంచిది. సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే డీహైడ్రేట్ అయ్యే ప్రమాదం ఉంది. కాబట్టి.. రోజంతా తగినంత నీరు తాగుతూ ఉండాలి.

## నమస్తే తెలంగాణ

ముల్కనూరు ప్రజా గ్రంథాలయం వారి

## ముల్కనూరు సాహితీ పీఠం

[ముల్కనూరు, భీమదేవరపల్లి(మం), హనుమకొండ జిల్లా]

సంయుక్త నిర్వహణలో




### పోటీ ప్రధాన ఉద్దేశం

సంస్కృతి, చరిత్ర, సమకాలీన జీవన వైవిధ్యాల, వైరుధ్యాల నేపథ్యంలో కథ ఉండాలి. నవ్యతకు, సృజనాత్మకతకు పెద్దపీట వేసే కథలకు మాత్రమే ఆహ్వానం పలుకుతున్నాం.

పోటీకి వచ్చిన కథలలో ఉత్తమమైన 22 కథలను ఎంపిక చేస్తాం.

బహుమతుల వివరాలు

బహుమతి పొందిన కథలు నమస్తే తెలంగాణ 'బతుకమ్మ'లో ప్రచురితం అవుతాయి.

పది కథలను సాధారణ ప్రచురణ కోసం స్వీకరిస్తాం. ఈ కథలకు వెయ్యి రూపాయలతోపాటు, జ్ఞాపికలు అందజేస్తాం.

బహుమతి పొందిన కథలను పుస్తక రూపంలో అచ్చు వేసే అధికారం పోటీ నిర్వాహకులకు ఉంటుంది.

ప్రథమ బహుమతి (ఒక్కరికి) రూ. 50,000

2 ద్వితీయ బహుమతులు (ఒక్కొక్కరికి) రూ. 25,000

3 తృతీయ బహుమతులు (ఒక్కొక్కరికి) రూ. 10,000

6 కన్సొలేషన్ బహుమతులు (ఒక్కొక్కరికి) రూ. 5,000

### నియమ నిబంధనలు

ఇంతకు ముందు ఎక్కడా (ప్రింట్ పత్రికలలో కానీ, వెబ్ పత్రికలలో కానీ, వ్యక్తిగత బ్లాగులలో కానీ, సోషల్ మీడియాలో కానీ) ప్రచురితం కాని కథలను మాత్రమే పోటీకి పంపాలి.

ఇప్పటికే ఎక్కడైనా పరిశీలనలో ఉన్న రచనలు పోటీకి అనర్హం.

పై అంశాలను ధృవీకరిస్తూ హామీపత్రం తప్పనిసరిగా జతపరచాలి.

ప్రచురణకు అంగీకరించని రాతప్రతులను తిరిగి పంపడం సాధ్యం కాదు.

ఒకరు ఒక కథను మాత్రమే పంపాలి.

రచనకు ఏ కలం పేరు వాడినా రచయిత / రచయిత్రి అసలు పేరు తప్పనిసరిగా హామీ పత్రంలో రాయాలి.

కథ అనువాదం, అనుకరణ, అనుసరణ కాదని హామీపత్రంలో స్పష్టం చేయాలి.

పోటీలో బహుమతి పొందిన ఏ కథనైనా, ఫలితాలు వెలువడిన తరువాత వెనక్కి తీసుకునే అవకాశం రచయితలకు లేదని గమనించగలరు.

బహుమతుల విషయంలో న్యాయ నిర్ణేతలదే తుది నిర్ణయం. ఈ విషయంలో ఉత్తర ప్రత్యుత్తరాలకు తావులేదు. రచయితలకు ప్రాంతీయ భేదం లేదు. ఏ రాష్ట్రమైనా, ఏ దేశంలో ఉన్న తెలుగు వారైనా కథలు పంపవచ్చు.

ముల్కనూరు లేదా హైదరాబాద్‌లో బహుమతుల ప్రదాన కార్యక్రమం ఉంటుంది. కథల పోటీ ఫలితాలు 'నమస్తే తెలంగాణ' బతుకమ్మలో ప్రచురితం అవుతాయి.

### పంపాల్సిన విధానం

- రాత ప్రతి అయితే కథ 12 పేజీలు మించకుండా ఉండాలి. పదాల్లో అయితే 1500 పదాలకు మించకూడదు. ఈ పరిధిని దాటితే, పరిశీలనకు స్వీకరించబడవు.
- ఈ-మెయిల్ ద్వారా పంపేవారు యూనికోడ్‌లో వర్డ్‌ఫైల్ పంపవచ్చు. దాన్ని పీడీఎఫ్‌లోకి కూడా మార్చి ఎటాచ్ చేయాలి.
- పేజ్‌మేకర్‌లో డీటీపీ చేయించి కథను పంపేవారు యూనికోడ్ ఫైల్‌ను, పీడీఎఫ్‌ను కూడా జతచేసి ఆ రెండిటినీ ఈ-మెయిల్‌లో ఎటాచ్ చేసి పంపాలి.
- కథలను ఆన్‌లైన్‌లో పంపేవారు దిగువ తెలిపిన ఐడీకి మాత్రమే మెయిల్ చేయాలి.
- కథల ప్రతులపై రచయిత/రచయిత్రి పేరు ఉండరాదు. విడిగా హామీపత్రంపై మాత్రమే పేరు, ఫోన్ నంబరు, ఈ-మెయిల్ ఐడీ రాయాలి.



కథలు పంపాల్సిన చిరునామా

బతుకమ్మ కథలపోటీ, నమస్తే తెలంగాణ
# 8-2-603/1/7, 8, 9, రోడ్ నంబర్ 10,
బంజారాహిల్స్, హైదరాబాద్ – 500 034.

ఈ -మెయిల్ ఐడీ
ntmulkanoorkatha2025@gmail.com

కథలు మాకు అందాల్సిన చివరి తేదీ ఫిబ్రవరి 28, 2025